మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఘన సన్మానం

కడ్తాల్, ఆగస్టు 31: రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావును మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో మంత్రిని... బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, చల్లంపల్లి మాజీ సర్పంచ్ నరేందర్ కలిసి శాలువాతో సన్మానించారు. కడ్తాల్ మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, అన్ని శాఖలకు కొత్త భవనాలు నిర్మించాలని మంత్రిని కోరినట్లు వారు పేర్కొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన లోయపల్లి గ్రామస్తులు

మంచాల, ఆగస్టు 31: లోవోల్టేజీ విద్యుత్ సమస్యను పరిష్కరించాలంటూ శనివారం మంచాల మండలం లోయపల్లి గ్రామానికి చెందిన రైతులు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ధర్మాయ చెరువు, చింతల చెలక ప్రాంతానికి చెందిన 25మంది రైతులకు సంబంధించిన మోటర్లు నిత్యం లోవోల్టేజీ సమస్యతో కాలిపోతున్నాయని చెప్పారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి 100కేబీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మాజీ ఎంపీపీ కొర్ర శ్రీనివాస్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌గౌడ్, మోతీరాంనాయక్, జంగయ్యగౌడ్, రైతులు రాజు, గణేశ్, లింగంనాయక్, పాపయ్య ఉన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

మంచాల, ఆగస్టు 31: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు అన్నారు. శనివారం మంచాల మండలం పటేల్‌చెర్వు తండా గ్రామంలో గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం వినాయకులను నిమజ్జనం జరిగే చెరువు వద్ద ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులు పోలీస్‌లు, విద్యుత్ శాఖ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట ఏఎస్సై సతీశ్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఓటరు జాబితా సవరణ

మొయినాబాద్, ఆగస్టు31: ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఓటరు జాబితాలో అధికారులు ముమ్మరంగా సవరణ చేపడుతున్నారు. కుటుంబ సభ్యుల ఓట్లు వేర్వేరు వార్డులో నమోదై ఉంటే ఒకే వార్డులోకి చేర్చేందుకు సవరణ చేపట్టారు. వార్డుల వారీగా ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 6వ తేదీన తుది ఓటరు జాబితా డ్రాఫ్ట్‌ను గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రదర్శించనున్నారు. 7 నుంచి ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు, మార్పు, చేర్పులు చేసుకోవాలంటే వాటిపై అభ్యంతరం తెలిపే అవకాశం కూడా కల్పించనున్నారు. 6న గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించే ఓటరు జాబితాను ఓటర్లు పరిశీలించుకోవాలని మొయినాబాద్‌లోని చిలుకూరు గ్రామంలో జరిగిన ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ఎంపీడీవో సంధ్య సూచిస్తున్నారు.

సృజనాత్మకతను వెలికి తీయాలి

కడ్తాల్, ఆగస్టు 31: మండల పరిధిలోని కేజీబీవీలో శనివారం వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు బాల సభలు ఉపయోగపడతాయని, అంతేకాకుండా నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినుల నృత్యాలు, ఆలపించిన గీతాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయ బృందం, వందేమాతం ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘన సన్మానం

కొత్తూరు, ఆగస్టు 31: ఎంపీడీవో కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్ గా పనిచేసిన శేఖర్ సేవలు మరువేనివని మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. కొత్తూరు ఎంపీడీవో కార్యాలయంలో ఆఫీసు సబార్డినేట్‌గా పనిచేస్తున్న శేఖర్ పదవీవిరమణ చేస్తున్న సందర్భంగా శనివారం ఎంపీడీవో కార్యాలయంలో వీడుకోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శేఖర్ దంపతులను ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఏఈ హేమంత్, మాజీ సర్పంచ్‌లు ప్రభాకర్, రాజు, రవీనాయక్, అగ్రికల్చర్ ఏవో గోపాల్, ఎంపీవో విజయలక్ష్మి, మాజీ ఎంపీటీసీ మోడీ దర్శన్, మాజీ ఉప సర్పంచ్‌లు, నర్సింహారెడ్డి, దశరత్‌నాయక్, జయేందర్‌రెడ్డి, దోపిండ్‌రెడ్డి, పండు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యకు సహకారం అందిస్తా

పెద్దఅంబర్‌పేట, ఆగస్టు 31: మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో ఏండ్లుగా విద్యను బోధించి బదిలీపై వెళ్లిన పలువురు ఉపాధ్యాయులు, కొత్తగా పాఠశాలకు వచ్చిన టీచర్లను ఆయా పాఠశాలల కమిటీలు, స్థానిక కౌన్సిలర్ దేవిడి గీతా వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

ప్రతి రైతుకూ రుణమాఫీ చేస్తాం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయాంజాల్, ఆగస్టు 31 : అర్హత ఉన్న ప్రతి రైతుకూ రుణమాఫీ చేస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి తొర్రూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతు రుణమాఫీపై ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని 9 సహకార సంఘాల సీఈవోలతో టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి రైతుకూ ప్రభుత్వం నుంచి రుణమాఫీ అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని 9 సహకార సంఘాల్లో మొత్తం రైతులు 8041 మంది రూ.46,64,96,415 కోట్లు లను రుణంగా తీసుకోగా, ఇప్పటి వరకు 3086 మంది రైతులకు రూ.19,56,86,581 కోట్లు మాఫీ కాగా ఇంకా 4355 మంది రైతులకు రూ.27,08,09,834కోట్లు మాఫీ కావాల్సి ఉందని వెంటనే మాఫీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సహకార సంఘాల సీఈవోలు ఎమ్మెల్యే, టెస్కాబ్ వైస్ చైర్మన్లకు వినతి పత్రం అందజేశారు.దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే రైతులకు రుణమాఫీ జరిగేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ సమావేశంలో సహకార సంఘాల సీఈవోలు రాందాస్, గణేశ్, లక్ష్మయ్య, నాగరాజు, ధన్‌రాజు, రాకేశ్, మాధవి, శ్రీనివాస్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

రుణమాఫీ సర్వేకు సహకరించాలి

కడ్తాల్, ఆగస్టు 31: రుణమాఫీపై అధికారులు నిర్వహిస్తున్న సర్వేకు రైతులు సహకరించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ ఆదిలక్ష్మి కోరారు. మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించేందుకు శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కుటుంబ నిర్ధారణ సర్వేను ఏడీఏ పరిశీలించారు. ఈ సందర్భంగా రుణమాఫీ కానీ రైతుల వివరాలను అధికారులు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రుణమాఫీకి అర్హులైన రైతుల కుటుంబ సభ్యుల వివరాలను నిర్ధారణ చేస్తున్నామని తెలిపారు. రుణమాఫీలో భాగంగా ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా బుక్‌లో పేర్లు వేర్వేరుగా ఉండి, రుణమాఫీ రాని రైతులు రుణం తీసుకున్న బ్యాంక్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీలత, ఏఈవోలు వందన, అభినవ్, కేదార్‌సింగ్, రైతులు పాల్గొన్నారు.

కడ్తాల్: ముద్విన్ గ్రామంలో చేపట్టిన కుటుంబ నిర్ధారణ సర్వేలో పాల్గొన్న ఏడీఏ ఆదిలక్ష్మి

ఆమనగల్లు : కుటుంబ నిర్ధారణ పత్రాలు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్‌కు అందజేస్తున్న రైతులు

లైన్‌లైన్‌లో రైతుల వివరాల నమోదు

ఆమనగల్లు, ఆగస్టు 31: మండలంలో మంగళపల్లి, చింతలపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో అధికారులు శనివారం పర్యటించి ఇంటింటి సర్వే నిర్వహించారు. కుటుంబ సభ్యుల నిర్ధారణ చేసి కుటుంబ సభ్యుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. సోమవారం మరియు చింతలపల్లి గ్రామంలో కుటుంబ నిర్ధారణ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు ప్రభావతి, నిఖిత రైతులు పాల్గొన్నారు.



చేవెళ్ల టౌన్: ప్రధానోపాధ్యాయుడు ఖాజాపాషాను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్లటౌన్, ఆగస్టు 31: అంకితభావంతో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ ఖాజాపాషా ఉద్యోగ విరమణ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని చేవెళ్లలో శనివారం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు ధీటుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు ఖాజాపాషాను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎంపీపీ విజయలక్ష్మి, చేవెళ్ల గ్రామ మాజీ సర్పంచ్ బండారి శైలజ ఆగిరెడ్డి, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, సీపీఐ నాయకులు ప్రభులింగం, మహిళా నాయకురాలు సమతారెడ్డి, నాయకులు, ఉపాధ్యాయురాలు ఉన్నారు.

చెక్కుల అందజేత

షాబాద్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శనివారం శంకర్‌పల్లి మండల పరిషత్తు కార్యాలయంలో 59 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి, ఎంపీడీవో వెంకయ్య, తహసీల్దార్ సురేందర్, నాయకులు ప్రవీణ్‌కుమార్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘన సత్కారం

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ మాజీ స్పీకర్, ప్రస్తుత శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి శనివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ గ్రామంలోని 5వ వార్డు కౌన్సిలర్ వనం శ్రీను కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను కౌన్సిలర్ వనం శ్రీను శాలువాతో ఘనంగా సత్కరించారు.

- ఆదిబట్ల, ఆగస్టు 31

అన్నదాతలను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

పీఏసీఎస్ గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

కడ్తాల్ (తలకొండపల్లి), ఆగస్టు 31: అన్నదాతలను అన్ని విధాలా ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో నాబార్డు నిధులు రూ.76 లక్షలతో నిర్మించిన పీఏసీఎస్ గోదాంను శనివారం డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయరంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. రైతులకు రుణాలను అందించడంతోపాటు, ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో రైతులకు రుణాలను అందించడానికి పీఏసీఎస్‌కు రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో డీసీసీబీ బ్యాంక్ సీఈవో లక్ష్మయ్య, జిల్లా అధికారి సుధాకర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రవికుమార్, డైరెక్టర్లు యాదయ్య, శేఖర్, దేవ్లానాయక్, వెంకట్‌రెడ్డి, యాదయ్యగౌడ్, శిరీష, నయీమోద్దీన్, రమేశ్, రఘువర్ధన్‌రెడ్డి, యాదమ్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని రామకృష్ణాపురంలో వీరాంజనేయ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో శతాబ్ధి టౌన్‌షిప్ ఎండీ కాసు శ్రీనివాస్‌రెడ్డి తండ్రి సంజీవరెడ్డి జ్ఞాపకార్థం రూ.20లక్షలతో నిర్మించిన విశ్రాంతి గదులు, ట్రస్ట్ ద్వారా చేపట్టిన సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బ్లాక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహ, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, అంజయ్యగుప్తా, సునంద, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రఘురాములు, శ్రీశైలం, రమేశ్, విష్ణుగౌడ్, రాజారెడ్డి, అమరేందర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సభ్యులు అంజిరెడ్డి, ఓంకారం, అంజయ్య, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

యాచారం, ఆగస్టు31: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం అధికారులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సీజనల్ వ్యాధుల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు, సూచనలపై అధికారులతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో కురుస్తున్న వర్షాలతో దోమలు, ఈగలు విజృంభించే అవకాశాలున్నాయన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను స్వచ్ఛదనంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆయన కోరారు. ఇండ్ల మధ్యన, రోడ్లపై గుంతల్లో, పాత టైర్లు, కొబ్బరి బొండాల్లో నీరు నిలువకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి ట్యాంకులు, సంపులను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని సూచించారు. ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి విషజ్వరాలు, దగ్గు, జలుబుతో బాధ పడుతున్నవారిని గుర్తించి తగిన చికిత్స అందించేందుకు కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా అంగన్‌వాడీ చిన్నారులు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులపై శ్రద్ధ వహించాలన్నారు. పల్లె దవాఖానల ద్వారా మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. వసతి గృహాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి వ్యాధులు ప్రబలకుండా సీహెచ్‌సీ ద్వారా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీలత, మండల వైద్యాధికారిణి రాజ్యలక్ష్మి, మండల ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

తక్కువ ఖర్చుతో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 31 : వర్షాలు కురిసి వ్యాధులు విజృంభిస్తున్నందున డయాగ్నోస్టిక్ నిర్వాహకులు అధిక ఫీజులు వసూళ్లు చేయకుండా తక్కువ ఖర్చులతో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలని డయాగ్నోస్టిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో డయాగ్నోస్టిక్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విషజ్వరాలతో బాధపడుతూ వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం కేంద్రాలకు వచ్చే రోగుల పట్ల తక్కువ ఖర్చులు తీసుకుని పరీక్షలు చేయాలని సూచించారు. ఈ మేరకు డయాగ్నోస్టిక్ నిర్వాహకులు తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి

మొయినాబాద్, ఆగస్టు 31 : తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఉద్యమకారులు కేబుల్ రాజు, కుమ్మరి రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం వారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఉద్యమకారులను ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో పెట్టిందని, 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఇంటి స్థలాలను కేటాయించి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

సీలింగ్ భూముల పరిశీలన

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 31 : మండలంలోని మజీద్‌పూర్ గ్రామంలో సీలింగ్ భూములను ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత రెడ్డి శనివారం సాయంత్రం రైతులతో కలిసి పరిశీలించారు. సీలింగ్ భూముల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. 1993లో అప్పటి ప్రభుత్వం 243 ఎకరాల సీలింగ్ భూమిని గ్రామానికి చెందిన 143 మంది పేద రైతులకు సర్టిఫికెట్లు ఇచ్చిందని రైతులు ఆర్డీవోకు వివరించారు. ఇప్పటికీ తమకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వలేదని తెలిపారు. కొంతమంది అధికారులు అక్రమార్కులతో కుమ్మక్కై సర్వేనం 161,162, 163, 164లో 17 మందికి చెందిన 18 ఎకరాల సీలింగ్ భూమిని ఇటీవల ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశారని ఆర్డీఓకు విన్నవించారు. ఈ భూమిపై పూర్తి విచారణ జరిపి రైతులకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని ఆర్డీవో హామీనిచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు ఎం నర్సింహగౌడ్, శ్రీశైలంగౌడ్, మల్లేశ్, సాయికుమార్, బాలయ్య, నర్సింహ, రమేశ్, నారాయణ, సుదర్శన్ ఉన్నారు.

సీలింగ్ భూములను రైతులతో కలిసి పరిశీలిస్తున్న ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి

గంజాయి రవాణా.. ఇద్దరి అరెస్ట్

ఆదిబట్ల, ఆగస్టు 31: గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్న ఘటన శనివారం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రానికి చెందిన బిశ్వజిత మధు, సంతోష్ సర్కార్ ఇద్దరు కలిసి ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్ సమీపంలో ఇద్దరిపై అనుమానం రాగా, పోలీసులు వారిని విచారించారు. వారి వద్ద తనిఖీ చేయగా ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించండి

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 31 : మండల కేంద్రంలోని జేఎన్ఎన్యూఆర్ఎం కాలనీలో 25 రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు శనివారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి వాటర్ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు వెంటనే కాలనీకి చేరుకొని సమస్య వివరాలను మండల మిషన్ భగీరథ ఏఈ రూపను అడిగి తెలుసుకున్నారు. పంపు మోటర్ చెడిపోవడంతో సమస్య తలెత్తిందని తెలిపారు. త్వరలోనే పంపు మోటర్‌ను బాగుచేయించి నీటి సరఫరాను అందిస్తామన్నారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ సిబ్బంది, కాలనీవాసులు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ఎర్త్ సెంటర్‌లో విద్యార్థినులనుద్దేశించి మాట్లాడుతున్న సీజీఆర్ వ్యవస్థాపకురాలు

కడ్తాల్, ఆగస్టు : పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉన్నదని కౌన్సిల్ గ్రీన్ రెవెల్యూషన్ సంస్థ వ్యవస్థాపకురాలు కోర్పోలు లీలమ్మ అన్నారు. మండల పరిధిలోని అన్నాస్‌పల్లి గ్రామంలోని ఎర్త్ సెంటర్‌లో శనివారం రాజా బహదూర్ వెంకటరమణరెడ్డి ఉమెన్స్ కాలేజ్‌కి చెందిన విద్యార్థినులకు పర్యావరణం–పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని కల్పించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛత, ఔషధ మొక్కల గురించి జేఎస్ఆర్ అన్నమయ్య విద్యార్థినులకు వివరించారు. అనంతరం నేచర్ వాక్‌లో భాగంగా విద్యార్థినులను అడవిలోని పరిస్థితులను సీజీఆర్ సభ్యుడు రజినీకాంత్ వివరించారు. కార్యక్రమంలో సీజీఆర్ వ్యవస్థాపకుడు లక్ష్మారెడ్డి, ఆర్‌బీవీఆర్ హెచ్‌వోడీ రజిని, కవిత, రవికిరణ్, ప్రోగాం కోఆర్డినేటర్ నగేశ్, విద్యార్థినులు పాల్గొన్నారు.

అధ్వానంగా బస్టాండ్

గుంతల్లో నిలిచిన వర్షం నీరు

బురద మయంగా మారిన ఆర్టీసీ ప్రాంగణం

పట్టించుకోని అధికారులు

యాచారం, ఆగస్టు31: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ శనివారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి అధ్వానంగా తయారైంది. బస్టాండ్‌లో ఏర్పడిన గుంతల్లో వర్షం నీరు నిలువడంతో బురదమయంగా మారింది. దీంతో చిన్నారులు, విద్యార్థులు, దివ్యాంగులు, వృద్ధులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ప్రయాణికులకు వసతులను కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంతో చిన్నపాటి వర్షానికే బస్టాండ్ చిత్తడిగా మారుతున్నదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు, ప్రజలు, ఆర్టీసీ సిబ్బంది కోరుతున్నారు.

జోరు వాన

ఇబ్రహీంపట్నం/ ఇబ్రహీంపట్నంరూరల్, ఆగస్టు 31 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో శనివారం తెల్లవారు జామున నుంచి మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలతో పాటు ఇబ్రహీంపట్నం, తుర్కయాంజాల్, ఆదిబట్ల, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీల్లో వర్షం జోరుగా కురిసింది.
కడ్తాల్ : మండలంలో విస్తారంగా వానలు కురుస్తుండడంతో కడ్తాల్, రావిచేడ్, చల్లంపల్లి, సాలార్‌పూర్, మక్తమాదారం,